

He not only points out the way but lovingly takes us by the hand & walks with us.... is Sadguru



శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై! సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీకీ జై!!

# గురుకృప

రాబోయే తరం... 'గురు'తరం

సద్గురునితో...
ముద్దులొలికే చిన్నారుల
చిట్టిచిట్టి పలుకుల
## ప్రత్యేక సంచిక
విజయదశమి

గురోవినతిమీ కరీ హృదయ మందిరీ యా బసా! సమస్త జగ్‌హే గురు స్వరూప చీ ఠసో మానసా! కరో సతత సత్కృతీ మతిహిదే జగత్పావనా



## సాయివంటి దైవంబు లేడోయి.... లేడోయి....

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి! ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి! ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!' అని
అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీ సాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించటమే మనం చేయగలిగింది, చేయవలసింది.

--- శ్రీ బాబూజీ

చిన్న విషయాలు... ఉన్న విషయాలు.


| | | | |
|---|---|---|---|
| 1. సాయివంటి దైవంబు లేడోయి! లేడోయి! | శ్రీ బాబూజీ | ............... | 2 |
| 2. ఉన్నమాట - అనుకున్న మాట | గురుకృప | ............... | 3 |
| 3. సద్గురు మహిమను తెలుసుకున్న వేళ | ప్రియాంక | ............... | 6 |
| 4. ఆలోచన - అవగాహన - అన్నీ బాబూజీనే... | స్నేహిత | ............... | 7 |
| 5. బాబూజీ మాటే నాకు మందు... | సాయిజ | ............... | 8 |
| 6. చిత్తరువు కాదది... | విజయ భాస్కర్ | ............... | 10 |
| 7. పెద్ద ఇబ్బందులు - చిన్న పరిష్కారాలు... | వ్యూహ | ............... | 12 |
| 8. చూడాలని కోరిక - ఏర్పాటు వారి బాధ్యత | మానస | ............... | 13 |
| 9. మార్కుల వెనుక మర్మం - గురు అనుగ్రహం | ప్రత్యూష | ............... | 14 |
| 10. అమ్మ మనసు మార్చారు - నన్ను శిరిడీకి చేర్చారు | వెంకటేశ్వరరావు | ............... | 15 |
| 11. అవగాహన అంకురించింది - ఆనందం వెంట వచ్చింది | రాజేష్ | ............... | 16 |
| 12. రసస్పందన | గురుకృప | ............... | 17 |
| 13. ఉందిగా అభయం - నాకెందుకింక భయం | శృతి | ............... | 19 |






## ఉందిగా అభయం - నాకెందుకింక భయం

'గురుకృప' చిన్నారుల సంచికతో మరింత సింగారంగా ముస్తాబయింది. మదికి మరింత ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని ఇస్తూ ఈ చిన్నారుల అనుభవాలు మరింత ఉద్వేగానికి లోను చేశాయి. ఈ చిన్నారుల్లోని పరిణితి చూసి, పరవశించని మది ఉండదు. తనకు కావలసిన కోర్కెను తీర్చడం, దాన్ని చాలా ఆనందంగా స్వీకరించడం ఒక ఎత్తయితే, మరొకరికి అందిన మధుర ఫలాన్ని (తన ఆనందానికి భిన్నమైనా) చూసి ఉల్లాసంగా ఉండటం సద్గురు వాత్సల్యంలో ఉన్న మత్తు. తనకందిన దానితో తృప్తి చెందడమే కాదు భిన్నంగా జరిగిన అంశాన్ని సద్గురు సంకల్పమని, అది మరొకరి ఈప్సితమని ఈ చిన్నారికి అవగతమవడం ఆనందకరం. సద్గురు వాత్సల్యపు చిరు చినుకులలో నిత్య నూతనంగా భాసిస్తున్న చిన్నారుల ఆలోచనలు, సద్గురు అభయం నిండుగా, మెండుగా ఉండగా శోభిస్తున్న ఈ చిన్నారుల ఆనందాలు. అలాంటి చిన్నారి చిరు ఆనందమే ఈ అనుభవం...

నా పేరు శృతి. నేను గురువుగారి వద్ద పొందిన అనుభవాన్ని మీతో పంచుకోవాలను కుంటున్నాను. మేము 2003 సం॥ జనవరి 4న శిరిడీ వెళ్ళాము. ఆ రోజు రాత్రి గురువుగారు దర్శనం ఇచ్చినపుడు తలకి Cap పెట్టుకుని వచ్చారు. అలా నేను గురువుగారిని చూడటం మొదటిసారి. అందుకేనేమో నాకు బాగా అనిపించలేదు. మరుసటిరోజు రాత్రి మరలా సాయియానాలో గురువుగారి దర్శనం కోసం కూర్చున్నప్పుడు అమ్మతో అన్నాను, ఈరోజు గురువుగారు Cap తీసేసి వస్తే బాగుండు అని. బాగా చలిగా ఉంది కదా ఇక ఈ ట్రిప్‌లో గురువుగారిని మామూలుగా చూడలేమేమో అని అమ్మ అంది. కానీ నేను Cap లేకుండా చూడాలి అని కోరుకున్నాను. గురువుగారు మెట్లు దిగి వస్తున్నప్పుడు చూస్తే Cap పెట్టుకునే ఉన్నారు. కానీ పగోడాలో నుండి యానా డయాస్ దగ్గరకు రావడానికి మధ్యలో ఉన్న తలుపు తెరవగానే Cap లేకుండా వచ్చారు. నాకు చాలా సంతోషం కలిగింది. మరుసటి రోజు సత్సంగం కోసం యానాలో కూర్చున్నప్పుడు సాయిప్రసాద్ అంకుల్ ఈరోజు సత్సంగం లో అనుభవాలు పంచుకుందాం అన్నారు. అందరిలో మాట్లాడాలంటే నాకు చాలా భయం. నేనెప్పుడూ అలా మాట్లాడలేదు. అలాంటిది సాయిప్రసాద్ అంకుల్ అనుభవాల మాట ఎత్తగానే నేనే ముందు వెళ్ళి నా అనుభవాన్ని చెప్పాను. నేను లేచి వెళ్ళగానే మా మమ్మీ, డాడీ ఆశ్చర్యపోయారట. ఆ తరువాత చాలామంది వాళ్ళ అనుభవాలు చెప్పారు. మామూలు టైముకి గురువుగారు దర్శనం ఇచ్చారు. ఆరోజు దర్శనంలో గురువుగారు Cap తో వచ్చారు. అపుడు నేను గట్టిగా అనుకున్నాను, నిన్న నా కోరిక తీర్చడం కోసమే Cap లేకుండా వచ్చారని. అందరం రూమ్స్‌కి వెళ్ళిపోయేటప్పుడు మేజర్ అంకుల్ (సురేష్‌బాబు గారు) నన్ను పిలిచి మరి ఈరోజు గురువుగారు Cap తో ఎందుకు వచ్చారు అని అడిగారు. వెంటనే నేను నాలాగే ఇంకెవరో Capతో చూడాలి అని కోరుకుని ఉంటారని చెప్పాను. Babuji is the one who makes everybody Merry and Happy, Thank You Guruji.

– **శృతి**, వైజాగ్.

విగ్రహారాధనను ఆదరించని ప్రార్థనా సమాజ సభ్యుడైన తండ్రి, బాబాకు నిత్య నైవేద్యాన్ని సమర్పించడేమో నన్న భావంతో శిరిడీకి వెళ్ళడానికి సంశయిస్తాడు రామచంద్ర. బాబాకు నివేదన చేయకుండా తాము ఏమీ స్వీకరించమని తండ్రి మాట ఇవ్వడంతో శిరిడీకి బయలుదేరాడు కొడుకు. నిత్య పూజను ప్రారంభించే ముందు బాబాకు సాష్టాంగ ప్రణామం చేసి తన బిడ్డ పూజను స్వీకరించినట్లే తన పూజను స్వీకరించమని, యాంత్రికంగా కాక తనలో ప్రేమను నింపమని వేడుకుంటాడు ఆత్మారామ్. అలా కొన్ని రోజులు నిర్విఘ్నంగా పూజ జరిగింది. మిల్లులో ముఖ్య అధికారి అయిన తండ్రి, ఒకరోజు ఆఫీసు పని ఒత్తిళ్ళలో తలమునకలై తాను రోజూ సాయికి సమర్పించే పటిక బెల్లాన్ని నివేదించడం మరచిపోతాడు. భోజన సమయంలో ఈ విషయాన్ని గుర్తెరిగిన తాను పశ్చాత్తాపంతో సాయిపటం ముందు మోకరిల్లి క్షమించమని వేడుకుంటాడు. నిస్సహాయుడై శిరిడీలో ఉన్న కొడుకుకు 'సాయి మహరాజ్‌ను నన్ను క్షమించమని' ఉత్తరం రాస్తాడు.

బిడ్డ నియమంగా రోజూ చేసే నిత్య నైవేద్యాన్ని స్వీకరించే బాబా, మశీదు చేరిన తల్లితో, 'అమ్మా! ప్రతిరోజూలాగే నేను ఈరోజు బాంద్రాకు వెళ్ళాను. తినడానికి, త్రాగడానికి ఏమీ లేక ఉపవాసంతో తిరిగి రావాల్సి వచ్చింది' అంటూ బాబా చెప్పిన మాటలు, ఈ బిడ్డకు అవగాహన కల్గించాయి. బాబాకు జరిగే నిత్య పూజలో లోపం జరిగిందని అవగతమయిన ఆ బిడ్డ తల్లిదండ్రి తండ్రికి ఉత్తరం రాస్తాడు, పూజలో లోపం జరిగిందని బాబా తెలియచెప్పినట్లు. ఇలా ఉత్తరాలు రెండు ఇరువురికి చేరాయి. వారి మనసులు తేలికపడ్డాయి ఆనందంతో!

నామదేవుని నైవేద్యాన్ని స్వీకరించడానికి పాండురంగడు విచ్చేస్తే, అదే తీరున తర్ఖడ్ నిత్యం నివేదించే భక్ష్యాలను స్వీకరించ వేంచేశారు శ్రీ సాయిబాబా. తన నిత్య నివేదనను సాయి స్వీకరిస్తున్నారన్న తర్ఖడ్ అవగాహనకు 'అమ్మా! ప్రతీరోజూ లాగానే నేను ఈ రోజు బాంద్రాకు వెళ్ళానన్న' సాయి మాటలే రాజముద్రిక. తాను రోజూ చేస్తున్న నిత్యక్రమం పట్ల ఆ బిడ్డకు ఉన్న నిబద్ధత, ఆ పూజలో తాను చూపే పరిపూర్ణత, సాయి స్వీకరిస్తున్నారన్న అవగాహన, సాయి మాటలతో – 'నిత్యక్రమం'లో తప్పు జరిగిందన్న అతని ఆలోచన, తప్పక మనకు కనువిప్పు కల్గించాలి.

నిత్య పూజలో తప్పు జరిగిందన్న విషయం అర్థం కాగానే తాను బాంద్రా వెళ్ళడానికి అనుమతి అడిగాడు రామచంద్ర. బాబా వెంటనే ఆ పూజను ఇక్కడే చూసుకోమంటారు. ప్రత్యక్ష సన్నిధానంలో ఉన్నానన్న విషయాన్ని గమనించడు రామచంద్ర. ఇలా ఆ చిన్నపిల్లవాడికి బోధిస్తూనే, బాబా మాటల ఆంతర్యాన్ని అర్థం చేసుకోలేని తర్ఖడ్ తల్లికి నిత్యక్రమం యొక్క విలువను తెలియజెప్పారు. అదేవిధంగా తర్ఖడ్ తండ్రికి పశ్చాత్తాపం కలగడం ద్వారా దైవం పట్ల ఎరుకను కల్గించి జీవితాన్ని అర్థవంతంగా మార్చారు.

ఇలా అందరికీ అందేదే సద్గురు లీలా ప్రభోదం. 'నేర్చుకోవాలన్న దృక్పథమే ఉంటే మన జీవితంలో జరిగే ప్రతి సంఘటన సద్గురు లీలా ప్రభోదమే' అన్న గురుదేవుల మాటల స్మృతి పథంలో మన జీవితాలు శోభించు గాక.... పూజ్య గురుదేవుల పాదాల చెంత సుమమై.......

– గురుకృప



సంపుటి : 8
సంచిక : 4
త్రైమాసిక పత్రిక
అక్టోబరు 2005

**నిర్వహణ**
గురూజీ
ఆశీస్సులతో
గురుబంధువులు

**చిరునామా**
గురుకృప
2-1-6
గాంధీచౌక్
తెనాలి - 01

☎
08644
227194 (O)

**ముద్రణ**
రామకృష్ణ ప్రింటర్స్
విశాఖపట్నం
ఫోన్స్ : 2798072,
2740222

**శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై !**
**సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీకీ జై !**

# గురుకృప

## రాబోయే తరం - గురుతరం

అంతటా తానై, అన్నిటా తానై మనందరిపై 'కృప'ను వర్షించే 'సద్గురు'వు అయిన పూజ్య గురుదేవుల జన్మదినం – మనందరికీ పర్వదినం.

8 వసంతాల నుంచి గురుకృప పత్రికలో ఈ శీర్షికను ప్రచురించుకుంటూ వస్తున్నాం. గురుబంధువులందరి భావాలను ప్రతిబింబించేలా మనందరి మధ్య 'ఉన్నమాట'లను, మనమనుకుంటున్న మాటలను క్రోడీకరించి ఈ శీర్షికను అందించడం జరిగింది. ఉన్నమాటలనే కాక, గురుపథంలో అనుసరించాల్సిన బాటను కూడా విశ్లేషించుకుంటూ, గురు లీలామృతాన్ని పంచుకునే ప్రయత్నం చేస్తోంది గురుకృప.

ఈసారి గురుదేవులు 'చిన్నారుల సంచిక'ను గురుకృప ద్వారా అందించే సంకల్పాన్ని ప్రసాదించారు. చిన్నారులు – చిన్న వయసు, పెద్ద మనసు. వారిదే రాబోయే తరం – తప్పక అవుతుంది అది గురుతరం. ఏం పంచుకుందాం ఈసారి వీరి గురించి! గురుదేవుల పట్ల వారికున్న ప్రేమను గురించి చెప్పుకుందామా! వారి అవసరాలను గురించి గురుదేవులతో వారు చెప్పుకుంటున్న తీరును ఆలకిద్దామా! తప్పటడుగుల చిన్నారులను వారు సరిదిద్దుతున్న తీరు చూసి పులకిద్దామా! అది మాటైనా, సద్గురువు చూపుతున్న బాటైనా, ఏదైనా సరే సద్గురువు మనకందించిన సుమధుర ప్రసాదమే, మనందరికి ప్రేమను పంచే అనుగ్రహ ప్రసాదమే!

ఇక అసలు విషయానికొద్దాం. పెద్దలు అందించిన సంప్రదాయంలో జీవించే విధానం మనది. ఇదే భారతీయ సంస్కృతి. ఈ సంప్రదాయంలో పెద్దలను గౌరవించడం, పెద్దల మార్గంలో జీవించడం ఉగ్గుపాలతోనే అలవడుతుంది.



విద్య, ధర్మం, విజ్ఞానం గ్రంథాల ద్వారానే కాక మన ఆచరణ ద్వారా భావితరాలకు అందుతాయి. 'మా అమ్మ ఇలా చేసేది – మా నాన్న ఇలా ప్రవర్తించేవారు' అని ప్రేమతో కూడిన ఆచరణను గురించి ఆనందంగా చెప్పుకుంటూ ఆచరింపయత్నిస్తారు భావితరాలవారు.

గంగను భువికి తీసుకువచ్చిన భగీరధుని వద్దకు బ్రహ్మ వచ్చి "నాయనా! నీ పెద్దలు సాధించలేనిది నువ్వు సాధించావు" అని ప్రశంసించాడు. దానికి భగీరధుడు 'స్వామీ! అది నిజం కాదు. వారు చేసిన తపస్సు నా దాకా వచ్చి నా దగ్గర ఫలించింది. మా పెద్దల బాటలో పయనమే ఈ ఫలితం' అంటూ చక్కనిమాట చెప్పాడు. ఒక తరం నుండి మరొక తరానికి అందాల్సిన సత్సంప్రదాయమిదే! ఇదే విధంగా ఈ రోజు ఎంతోమంది చిరంజీవులు కేవలం వారి తల్లిదండ్రులను అనుకరిస్తూ, బాబా, బాబూజీలకు నమస్కరించవచ్చు. ప్రారంభంలో అది అవగాహన లేని ఆచరణే కావచ్చు, కాలం గడిచేకొద్దీ ఆచరణలో అవగాహన తప్పక అంకురిస్తుంది. అదే సద్గురు అనుగ్రహ వైభవము, అదే సద్గురు సంప్రదాయ విభవము. సద్గురుమూర్తి చెంత అవగాహన రాదన్న చింత లేదన్నమాట. తప్పక నిజమండీ! సందేహమైతే ఒక్కసారి మీ స్వానుభవాల పుటలను చక్కగా చదవండి, అవగతమవుతుంది. ఓహో! లేకపోవడమేమిటి? లెక్కకు మిక్కుటముగా మాకు స్వానుభవాలు! అయితే చిన్నారులు ఈరోజు చూస్తున్న మన బాట ఎలా ఉంది, ఎలా ఉండేట్లు చూద్దాం!

మస్తిష్కం చిన్నదైనా మనసు పెద్దది ఈ చిన్నారులది. తల్లిదండ్రులుగా, బంధువులుగా, గురుబంధువులుగా మనం నడిచే బాటన వేసే ప్రతి అడుగును అనుక్షణం గమనిస్తూనే ఉంటుంది ఈ బాలల పథం. ఒకే దైవం – ఒకే ధ్యానం – ఒకే ధ్యేయం అంటూ సాయిబాబాను పూజించే మనం భిన్నంగా ప్రవర్తించామా? వారిలో మనం నమ్మిన దైవం పట్ల మనమే సందేహ బీజాన్ని నాటిన వాళ్ళమవుతాము.

జాతకాల జాడ్యాన్ని, వితంతువుగా మారుతున్న తంతుల్ని వదిలివేయమన్న సద్గురు దేవుల మాటకు మనం మన జీవితాల్లో పెద్దపీట వేశామా! చేసే ప్రతి పనిని పరిపూర్ణంగా చేయమన్న బాబూజీ వాక్కును మనం ఎంతవరకు అమలు పరుస్తున్నాం! మన జీవితంలో ఎదురయ్యే కష్ట, సుఖాల పట్ల మన స్పందన ఎట్లా ఉంది. ప్రతి అంశాన్నీ మనం సద్గురు దేవునితో మమేకం చేసుకుంటున్నామా! అనన్య దైవమైన సద్గురు సన్నిధానాన్ని చేరినపుడు మన ప్రవర్తన, ఆలోచన ఎలా ఉంది? అవసరమైన ప్రతిదానిని అందించేది సద్గురువే అంటూ, వారిచ్చిన ప్రతిదానిని మనం ఆస్వాదిస్తున్నామా! 'సాయిబాబా'





# రస స్పందన

భగవంతుని కొరకు సదా పరితపించే హృదయమే భక్తికి పునాది. అనన్య ప్రేమతో పరిఢవిల్లిన భక్తుల గాథలు, మనందరిని శరణాగతి మార్గమున గమ్యము చేర్చు రహదారులు. ఈ బాట వెంట వెళ్ళిన వారికి గోచరించేవి – ప్రేమ, మమత, కరుణ, పరిపూర్ణత, త్యాగం, ... ఇత్యాదులెన్నో. మంచిని మధురంగా అందించి, చెడును చీపురుతో శుభ్రపరిచే ఈ గాథలు సదా స్మరణీయం, బహు రమణీయం.

భక్తితో రమించే ప్రయత్నం సాగిస్తోంది గురుకృప. భక్తుల గాథలనెడి పుష్పము చుట్టూ తిరుగుతూ, భక్తి అనెడి మకరందాన్ని గ్రోలే ప్రయత్నం చేద్దాం. భక్తుల చరితల్లోనే మన జీవన విధానం దాగివుంది. దైవం పట్ల మన అవగాహన గూర్చిన ఆలోచన దాగి వుంది. అనన్య దైవంగా ఆశ్రయించిన సద్గురువును అనుసరించాల్సిన అడుగుల గురుతులు అందంగా దర్శనమిస్తాయి వీరి బ్రతుకు బాటల్లో, భక్తిభావంతో నిండిన వారి మాటల్లో. భగవానుని బాటను వారి జీవితమనే భాష్య రూపంలో అందించి, భగవానుని అవతార కార్యంలో పాత్రలై, మన భక్తిపాత్రలను సమృద్ధిగా నింపి, సత్య జీవనానికి జీవము పోశాయి వీరి గాథలు.

భారత ఆధ్యాత్మిక నందనవనంలో విరబూసిన చిన్న (చిన్నారి) పువ్వులెన్నో! పువ్వు చిన్నదే గానీ వాటి పరిమళం, ఎల్లలు దాటింది – మనం చేసే కార్యాలపట్ల కనువిప్పు కలిగించింది. ప్రహ్లాదుని భక్తి నుండి, ధృవుని పట్టుదల నుంచి, నామదేవుని ఆచరణ నుంచి, మనకెంతో బోధ అందింది. అలాచిన్నారులే వారు – అవతార కార్యాన్ని నిర్వర్తించి, పారిజాత పరిమళాలను అందించినారు.

అయిదు సంవత్సరాల నామదేవ్, తండ్రి అయిన దామాశేర్ పొరుగూరు వెళ్ళడంతో రంగనికి నివేదన చేయడానికి ఆలయం చేరాడు. భక్తి భావంతో వినమ్రంగా పాండురంగని భక్ష్యములను ఆరగించమని కోరాడు. కనిపించి కరుణించని రంగనికై కలత చెందాడు, ఆరగించని వరదునికై ఆరాటపడ్డాడు. పసి హృదయపు బాధచూసి పాండురంగడు స్వయంగా వచ్చి, నివేదన స్వీకరించి వెళ్ళాడు. బిడ్డ తీరు తెలిసిన దామా, మరొక్కసారి నివేదన పంపి తాను కూడా రంగని దర్శనం చేసుకుని ధన్యుడయ్యాడు. బిడ్డకు తండ్రి మాటలే అర్థమయ్యాయి, మర్మం ఎరుగడు ఆ బిడ్డ. అందుకే మనస్సు తీరా అడిగాడు, మహిమ చూప ఎదురయ్యాడు రంగడు. ఇదొక భక్తి తరంగం, మర్మము లెరుగని అంతరంగం.

సద్గురు సామ్రాట్టు సాయి చెంతన కూడా పరిమళించాయి ఈ చిన్నారి కుసుమాలు, ఆఘ్రాణిద్దాం ఆ పరిమళాన్ని. సాయి భక్తశ్రేష్ఠులలో ఒకరు శ్రీ ఆత్మారామ్ తర్ఖడ్. వారి ఇంట సాయి పదాశ్రయుడైన ఒక చిన్న పుష్పంగా వారి కుమారుడు – శ్రీ రామచంద్ర తర్ఖడ్. సాయి అంకిత భక్తుడు ఈ బాలుడు. చిన్నతనం నుంచే సాయికి సమర్పించకుండా ఏమీ స్వీకరించేవాడు కాదు. ఈ బాలుని తల్లి కూడా సాయికి పరమ భక్తురాలు. ఒకసారి ఆమె శిరిడీ వెళ్ళి సాయిని దర్శించాలని అభిలషించింది.



# అవగాహన అంకురించింది - ఆనందం వెంట వచ్చింది

పూజ్య సద్గురుమూర్తి బాబూజీ ఏర్పాటు చేసిన కంచె (సత్సంగం) ఫలితాలనివ్వడం ప్రారంభించింది. అందులో ఆశ్చర్యమేముంది... కొత్తదనమేముంది అంటారా! చేను ఇంకా నారు దశలోనే ఉంది, కానీ ధాన్యం సమృద్ధిగా వచ్చింది. నిజమే! బాబూజీ ఏర్పాటు చేసిన ఈ సత్సంగాలు – చిన్నారుల అవగాహనకు వేదికలు – వారి ఆలోచనలకు అంకురార్పణలు. పూజ్య గురుదేవుల చెంతకు చేరారో లేదో అప్పుడే వారు 'నేర్చుకోవడం' మొదలుపెట్టారు. నిష్కల్మషమైన వారి మాటలతో మనల్ని పడగొట్టారు. మహదానందం. గురుదేవుల చెంతకు చేరిన ఈ తరం అందంగా, ఆనందంగా మరొకరికి మార్గదర్శులవ్వాలన్న ఆకాంక్షను వ్యక్తం చేస్తూ ఈ అనుభవం...

నా పేరు రాజేష్. నాకు మొదట్లో బాబా అంటే అంత ఇష్టం ఉండేది కాదు. అయినా ఒక గురుబంధువు వల్ల నేను బాబా సత్సంగానికి వెళ్ళేవాడిని. నేను 5వ తరగతి చదువుతున్నాను. నాకు పరీక్షలు మొదలయ్యాయి. నేను పరీక్షలౌతున్న ప్రతిరోజు బాబాకి, గురువుగారికి ఇలా చెప్పుకొనేవాడిని. "బాబా! నాకు పరీక్షలు జరుగుతున్నాయి. నాకు ఫస్ట్ ర్యాంక్ వచ్చేలా చేయండి. నేనే కాదు అందరూ బాగా రాయాలి" అని చెప్పుకున్నాను. పరీక్షలు అయిపోయాయి. నేను ఒక రోజు మా లెక్కల సార్‌ని అడిగాను. సార్ ఎవరికి ఫస్ట్ ర్యాంక్ వచ్చింది అని. నీహారిక అనే నా క్లాస్‌మేట్‌కి ఫస్ట్‌ర్యాంక్ వచ్చింది అని చెప్పారు. అప్పుడు నాకు చాలా బాధగా ఉంది. నాకు సెకండ్ ర్యాంక్ వచ్చినందుకు కాదు ఆ అమ్మాయికి ఫస్ట్ ర్యాంకు ఎందుకు వచ్చిందన్న బాధ. ఆ రోజు గురువారం. ఎప్పటిలాగానే నేను సత్సంగానికి వెళ్ళాను. అక్కడ అంకుల్ ఒకటి చెప్పారు. ఎదుటివాళ్ళకి సమస్యలు తీరి ఆనందంగా ఉంటే మనం చూసి బాధపడకూడదు. వాళ్ళను చూసి ఆనందించండి అని చెప్పి మీరు కూడా ఆనందంగా ఉండడానికి ప్రయత్నం చెయ్యండి అని చెప్పారు సరే అని బాబాకి నమస్కరించుకున్నాను. ఫలితాలు 26వ తేదీన వచ్చాయి. ఆ రోజు నాకు తలనొప్పిగా ఉంది అని హాస్పిటల్‌కి వెళ్ళాను. నేను ఇంటికి వచ్చి, నా క్లాస్‌మేట్ అరుణ అనే అమ్మాయిని ఎవరికి ఫస్ట్ ర్యాంక్ వచ్చింది అని అడిగాను. నీకే ఫస్ట్‌ర్యాంక్ వచ్చింది అని చెప్పింది. నాకు నమ్మకం కలుగలేదు. స్కూలు పునఃప్రారంభమైన రోజున నేను స్కూల్‌కి వెళ్ళి అక్కడ నోటీస్‌బోర్డు మీద చూస్తే రాజేష్ ఫస్ట్ ర్యాంక్, నీహారిక సెకండ్ ర్యాంక్ మరియు అరుణ థర్డ్ ర్యాంక్ అని ఉంది. దాంతో తెలియని ఆనందం. అప్పటి నుండి బాబాయే నా ప్రాణం, అంతా ఆయనే చూసుకుంటారని తెలిసింది.

**- రాజేష్**, ఋషికొండ.





అన్న ఒక్క వాక్యమే సర్వశాస్త్రముల సారమంటూ, చివరకు సద్గురు సన్నిధానాన ఇతరములకు ప్రాధాన్యతనిస్తున్నామా! ఏం చేస్తున్నాం మనం? మాటల మూటలేనా! మహితమూర్తి మార్గాన పయనించే జీవనాన్ని అలవరచుకున్నామా!

అలాగని మనం బిడ్డలకు కలిగిన భావాలను త్రోసిపుచ్చడం కాదు చేయవలసింది, వారి అవగాహనకు తగ్గట్లు వారికి ప్రతి విషయాన్ని తెలియపరచాలి. మనం వేసుకునే దుస్తులను చూసి మన బిడ్డ మనలను సాయి భక్తుడుగా భావించకూడదు, మనకు మన గురువు పట్ల ఉన్న ప్రేమ, వారి మాటను మనం ఆచరించే తీరు, సద్గురువు చూపిన బాటన నడవాలన్న మన తపన, చేసే ప్రతి పనిలోనూ పరిపూర్ణత సాధించడం పట్ల మనకున్న నిబద్ధత, అవసరమైన చోట సాటివారికి సహాయపడే గుణం..... ఇలా ఎన్నో సుగుణాలు, సద్గురువనే గుబాళింపుల ఉద్యానవనంలో మనం కోసుకున్న సుగంధ పుష్పాల సమాహారమైన మన జీవన విధానం, వారిని మరింత ఇష్టపూర్వకంగా గురుదేవుల చెంతకు చేర్చాలి.

బాబూజీ చెంతకు చేరిన వారందరూ వారి బిడ్డలే! అయితే అన్నీ ఇచ్చిన ఆ సద్గురువే మనకు వివేకాన్ని కూడా ప్రసాదించారు. ఆ వివేకంతో మనం నడిచే బాటన ఎట్టి కలుపు లేకుండా, రాకుండా చూసుకుందాం! ఏర్పరుచుకున్న సత్సంగమనే కంచెను కాపాడుకుందాం! మన నడతే భావి తరాలకు ఆదర్శంగా ఉండాలి కనుక ఈ బాటనే ముళ్ళుగా అన్పించే మూఢాచారాలను, దురాచారాలను, మూఢ నమ్మకాలను విడనాడదాం. ఈర్ష్య, అసూయలను ఈసడించుదాం. సద్గురువే సర్వమన్న సాయి సామ్రాట్ బోధను మనకు పూలబాటగా మలుచుకుందాం. మన ఆచరణతో సద్గురు పథాన్ని మరింత శోభాయమానం చేద్దాం. ఋణానుబంధంతో వారి చెంతకు చేరిన ప్రతి జీవితోనూ మనం ఋణం పెంచుకుందాం. భావితరాలకు బంగరు బాటను చూపడమే కాక, ఆ పథంలో నడిచేందుకు ఆదరువుగా, తోడుగా నిలిచే సద్గురు పథంలో చేరాం. సద్గురు అనుగ్రహ సాగరంలో దిగినాము. మునిగితే తరించిపోదాం. తేలితే తరింపచేద్దాం. ఇక ఆలోచన ఎందుకు! పదండి, గురుదేవులు సాయి సంకీర్తనలో పాల్గొనేందుకు వస్తున్నారు, దర్శిద్దాం, పులకించుదాం, తరిద్దాం..............

సద్గురువే సత్యమని, 'సర్వప్రాణుల కూపిరూదే విశ్వాత్మ రూపపు ప్రేమతత్త్వమే' వారి నిజతత్త్వమని తెలుసుకుని సద్గురు చరణాల చెంత సేదదీరుదాం.

మన భావాలను, పనులను సద్గురువు చెప్పిన రీతిలో అవగతం చేసుకుని ఆచరించి మన భావితరాలకు చక్కగా, గొప్పగా అందించాలి – అదే సాంప్రదాయం.

**- గురుకృప**



## సద్గురు మహిమను తెలుసుకున్నవేళ

నిత్యజీవితంలో జరిగే ఏ సంఘటనలోనూ మనం మార్చగలిగింది ఏమీలేదు. కేవలం సద్గురు అనుగ్రహం మాత్రమే ఏ విషమ పరిస్థితికైనా, సంకట స్థితికైనా సమాధానం చూపగలదు. శ్యామా తమ్ముడు బాపాజీ భార్యకు ఆరోగ్యం బాగాలేదని తెలిసి, వెంటనే బాబా అనుమతితో బయల్దేరదామనుకున్న శ్యామాతో ఊదీ పంపు, రేపు ఉదయం వెళ్ళవచ్చు అని సున్నితంగా చెప్పారు బాబా. ఆ తరువాత రోజు శ్యామా వెళ్ళేసరికి ఆమె చాలా ఆరోగ్యంగా తిరుగుతూ వుంటుంది. కేవలం బాబా మాట చాలు – ఆమె ఆరోగ్యం బాగవడానికి. అదే విధంగా బాబూజీ చెంతకు చేరి, ప్రియాంక అనే చిన్నారి ఆరోగ్యం గురించి తెలియజేశారు గురుబంధువులు. ఆ తరువాత..... చదివి పులకిద్దాం ఆ చిన్నారి మాటలను.

నా పేరు జి. ప్రియాంక, వయసు 10 సం॥లు 6వ క్లాస్ చదువుతున్నాను. నేను ఒక సంవత్సరము నుండి మా అమ్మతో కలిసి సత్సంగానికి వస్తున్నాను.

తేది 16–3–2005న నాకు విపరీతంగా జ్వరము, కడుపులో నొప్పి వచ్చినాయి. శరీరం అంతా పసుపు వర్ణంగా మారింది. తెనాలిలో డాక్టర్లు చూసి, గుంటూరు వెళ్ళమన్నారు. అక్కడ కూడా లాభం లేదని హైదరాబాద్ వెళ్ళాము. ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీలో చేర్పించినారు. డా॥ నాగేశ్వరరెడ్డి గారు హెపటైటిస్ – బి అని చెప్పారు. ప్రతిరోజూ రక్తపరీక్షలో హెపటైటిస్ – 3 శాతం పెరుగుతోంది. కుటుంబ సభ్యులు నిద్రాహారాలు మాని బాధపడుతున్నారు.

ఇదే సమయంలో తెనాలి సత్సంగం నుండి తిరువణ్ణామలై వెళ్ళిన క్రిష్ణ ఆంటీ, లోకేశ్వరి ఆంటీ, పద్మ, లక్ష్మి, లావణ్య మరికొందరు గురుబంధువులు నా గురించి గురువు గారికి చెప్పారట. అక్కడ వారు చెప్పిన క్షణం నుండి హైదరాబాద్‌లో ఉన్న నాకు జబ్బు తగ్గటం ప్రారంభించింది. డాక్టర్లు సైతం ఆశ్చర్యపోయారు. ఫోన్ ద్వారా గురుబంధువులు, గురువు గారికి చెప్పిన విషయం చెపితే, మేము 'వ్యాధి తగ్గుతున్న విషయం' చెప్పాము. 15 రోజుల తర్వాత పూర్తి ఆరోగ్యముతో ఇంటికి వచ్చాను. ప్రస్తుతం స్కూలుకి కూడా వెళుతున్నాను.

**- జి. ప్రియాంక**
తెనాలి.





## అమ్మ మనసు మార్చారు - నన్ను శిరిడీకి చేర్చారు.

కల్మషం లేని చిన్నారులు – సాక్షాత్తూ దైవస్వరూపులు. సద్గురు వాత్సల్యమే వారికున్న పట్టు, సద్గురువెప్పుడూ వుండు వారి జట్టు. నాడు బాబా చెంత జరిగింది, నేడు గురుదేవుల చెంత జరుగుతోంది ఈ వాత్సల్య లీలావినోదమే. పసిపిల్లలను ఎత్తుకొని పలకరిస్తూ... వినోదంగా మాట్లాడుతూ... తాను చిన్నారిలా మారి ఆనందించేవారు బాబా. ప్రక్క గ్రామం నుంచి తరచూ శిరిడీ వచ్చే పిలాజీ గురవ్, తన 10 సం॥రాల కొడుకు తనతో శిరిడీ వస్తానని మారాం చేస్తే వాడిని కొడతాడు. శిరిడీ చేరిన పిలాజీతో 'ఆ చిన్నవెధవను కొడితే ఊరుకోను – వాడు నీతో కూడా వస్తే నీదేం పోతుంది. ఈసారి వాడిని కూడా తీసుకువస్తూండు' అని అంటారు బాబా. తరాలు జరిగిపోయాయి. తల్లిదండ్రుల జీవనవిధానాలు మారాయి. ఎన్ని మారినా, ఎన్ని జరిగినా మార్పు లేనిది, కలకాలం అలా నిలిచిపోయింది సద్గురు వాత్సల్యమే... ఆస్వాదిద్దాం... సద్గురు వాత్సల్యమనే పూలగుబాళింపుని.

నా పేరు ఆర్. వెంకటేశ్వరరావు. నాకు 12 సం॥లు. మాది తెనాలి. మాది పూల వ్యాపారం మా నాన్న గంగానమ్మపేట సత్సంగానికి పూలు నాచేత పంపేవాడు. అలా నేను ఒక సంవత్సరం నుండి సత్సంగానికి రావటం మొదలుపెట్టాను. జి.కె. గారు సత్సంగం చేసేవారు. వింటుంటే బాగా ఉండేది. ఆయన 2004 విజయదశమికి గురువుగారి 50వ పుట్టినరోజు మరియు బాబా విగ్రహం పెట్టి 50 సం॥లు. అందరూ తప్పకుండా శిరిడీ వెళ్ళండి అన్నారు. చాలా మంది వెళ్తామని అంటున్నారు. నాకు శిరిడీ వెళ్ళాలని బాగా కోరిక కలిగింది. మా అమ్మతో చెప్తే, శిరిడీ దగ్గర వుందనుకున్నావా, 3 రాష్ట్రాలు దాటాలి, పిల్లవాడివి, ఒక్కడివే నాన్న పంపరు అని అరిచింది. మా నాన్న కూడా వెళ్ళవద్దన్నాడు. నేను చాలా బాధపడ్డాను. శిరిడీ వెళ్ళే టైం దగ్గర పడుతోంది. నేను బాబా గుడిలో కొబ్బరికాయ కొట్టి ఎలాగైనా శిరిడీ పంపమని దణ్ణం పెట్టుకున్నాను. మా అమ్మను మళ్ళీ అడిగాను. చెప్తే వినే పనిలేదా అని నన్ను కొట్టింది కూడా. నేను మా పెద్దమ్మను అడిగాను, ఎలాగైనా చెప్పి పంపించమని. మా పెద్దమ్మ, మా అమ్మ, నాన్నలతో చెప్పి ఒప్పించింది. నా సంతోషం ఆగలేదు. మా నాన్న 600 రూపాయలు ఇచ్చాడు. సత్సంగంలోని పద్మ అక్క వాళ్ళతో శిరిడీ వెళ్ళాను. నాగర్‌సోల్‌లో శిరిడీ వెళ్ళటానికి బస్సులు అందలేదు, వ్యానులు కుదరలేదు. 2,3 గంటలు అక్కడే ఉండి, ఎలాగో మధ్యాహ్నం గం॥ 12–30 ని॥లకు శిరిడీ వెళ్ళాము. గుబ్బా సత్రంలో దిగాము. సాయంత్రం 6 గంటలకు మందిరానికి అక్క, నేను అందరం వెళ్ళాము. బాబాని చూశాను. నాకు చాలా సంతోషం కలిగింది. పద్మక్క వాళ్ళనుండి నేను తప్పిపోయాను. రాత్రి గం॥ 8–30 అయింది. పద్మక్క కోసం చాలాసేపు వెతికాను. వాళ్ళు ఎక్కడా కనిపించలేదు. డబ్బులు మొత్తం పద్మ అక్కకి ఇచ్చాను. నా దగ్గర డబ్బులు లేవు. నాకు బాగా ఆకలి వేసింది. మందిరం దగ్గర కాసేపు కూర్చున్నాను. మళ్ళీ లేచి వస్తుంటే మందిరం ముందు 4 రూపాయలు దొరికాయి. సంస్థానం వారు పెట్టే 4 రూపాయల భోజనం చేసి, మెల్లగా సత్సంగాన్ని వెతుక్కుంటూ చేరుకున్నాను. అప్పటికి గురువుగారు వచ్చి వెళ్ళిపోయారు. పద్మ అక్క వాళ్ళని కలుసుకుని, వాళ్ళ దగ్గరే వున్నాను. 7 రోజులు శిరిడీలో ఉండి, గురువుగారి దర్శనం, బాబా దర్శనం రోజూ చేసుకొని, తెనాలి వచ్చేశాను. నాకు చాలా ఆనందం వేసింది.

**- వెంకటేశ్వరరావు**, తెనాలి.



చూడాలనుకుంటే గురువుగారికి చెప్పుకో అని చెప్పి వెళ్ళిపోయింది. నేను అలాగే గురువుగారి దగ్గరకు వెళ్ళి నాకు మిమ్మల్ని చూడాలని ఉంది. తిరువణ్ణామలై తీసుకువెళ్ళండి. నాకు సెలవులు లేవు అని గురువుగారికి చెప్పుకున్నాను. అమ్మా, నాన్న – భాను అంకుల్ వాళ్ళ ఇంటికి వెళ్ళి తిరువణ్ణామలై వెళ్ళడానికి ఎంతవుతుంది, ఎలా వెళ్ళాలో అన్ని విషయాలు కనుక్కొని ఇంటికి వచ్చి మనం తిరువణ్ణామలై వెళ్తున్నాం అని చెప్పారు. నేను వెంటనే గురువుగారి దగ్గరకు వెళ్ళి థ్యాంక్స్ చెప్పుకున్నాను.

20వ తేదీన డాడీ 22వ తేదీకి రిజర్వేషన్ చేయించారు. 21న అయితే ఖాళీలు వున్నాయి కానీ మా తమ్ముడికి ఆ రోజు వరకూ ఎగ్జామ్స్ ఉన్నాయి. అందుకని వెయిటింగ్ లిస్ట్‌లో అయినా 22వ తేదీకే రిజర్వ్ చేయించుకున్నాము. టికెట్స్ 21వ తేదీనే కన్‌ఫర్మ్ అయ్యాయి. చక్కగా మేము తిరువణ్ణామలై వెళ్ళాము. అక్కడ నేను గురువుగారిని దగ్గరనుండి చూసి చాలా హ్యాపీగా ఫీల్ అయ్యాను. చక్కగా అక్కడ ఉన్న అన్ని స్థలాలు చూసి ఎంజాయ్ చేశాము. నాలుగు రోజులు ఉండి వచ్చాము.

అసలు అమ్మా, నాన్న అనుకున్నదానికన్నా తక్కువ ఖర్చుతో తిరువణ్ణామలై వెళ్ళివచ్చాము. మా అమ్మ ఎక్కడికైనా వెళ్ళడానికి అవసరమవుతాయని డబ్బు దాస్తూ ఉంటుంది. అలా ఆ డబ్బుతో వెళ్ళొచ్చాము. అంతే కాకుండా ఇప్పుడు దసరాకి అమ్మానాన్న శిరిడీ వెళ్తున్నారు. మేము అడగకుండానే మాకు కూడా రిజర్వేషన్ చేయించారు. నాకు మళ్ళీ గురువుగారిని చూస్తున్నందుకు చాలా హ్యాపీగా ఉంది. **మానస**, విశాఖపట్నం.

## మార్కుల వెనుక మర్మం - గురు అనుగ్రహం

తన చదువుపై ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయిన టెండూల్కర్ జ్యోతిష్యాన్ని ఆశ్రయించి మరింత కృంగిపోతాడు. మెడిసిన్ పరీక్షలో ఉత్తీర్ణుడవ్వడని అభిప్రాయపడతాడు. బాబా ధైర్యవచనాలతో పరీక్షకు వెళ్ళి, ఆనంద సాగరంలో మునిగాడు టెండూల్కర్. అలాంటిదే ప్రత్యూష అనుభవం. బాబూజీ చెంతకు చేరాక మనం మన పిల్లల్లో పెంపొందించాల్సిన విషయం ఏమంటే... *Our Life is Full of Grace... So Nothing is Impossible.*

నా పేరు ప్రత్యూష. నాకు గురువుగారంటే చాలా ఇష్టం. నేను మొదటిసారి 2004 సం॥లో మద్రాసులో గురువుగారిని దర్శించుకున్నాను. పాద నమస్కారం చేసుకునే అదృష్టం కూడా కలిగింది. నేను తెనాలిలోని వివేక పబ్లిక్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాను. నా హ్యాండ్ రైటింగ్ సరిగా ఉండదు. నాకు 7వ తరగతి కామన్ ఎగ్జామ్స్‌లో రైటింగ్ సరిగా లేకపోతే మార్కులు తీసివేస్తారేమో, కాబట్టి నాకు 400 మార్కులు కూడా రావని భయపడ్డాను. అప్పుడు నేను గురువుగారికి లెటర్ రాసి పంపాను. తరువాత కొన్ని రోజులకి మా రిజల్ట్స్ వచ్చాయి. నాకు 508 (600కి) మార్కులు వచ్చాయి. నాకు అన్ని మార్కులు వచ్చాయి అంటే గురువుగారి అనుగ్రహం వల్లనే.

**- ప్రత్యూష**, బుర్రిపాలెం.





## ఆలోచన - అవగాహన - అన్నీ బాబూజీనే

బిడ్డయొక్క ఉన్నతిని ఆశించే తండ్రి, జరిగే ప్రతి విషయాన్ని చక్కగా గమనించి, అవసరమైన క్షణాన అన్ని ఏర్పాట్లు చేస్తారు. తాను చదివిన భూగర్భ శాస్త్రంలో, దగ్గర ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశం లేక బర్మా వెళతానంటాడు నార్కే, సాయి చరిత్రలో. అయితే సాయి మాత్రం 'నిన్ను పూనాలో స్థిరపరుస్తానంటూ...' వారి మాట చెప్పారు. నార్కేకు ఉద్యోగం కోసమా అన్నట్లు పూనాలోని కళాశాలలో ఈ విభాగం ప్రారంభమయి నార్కే పూనాలో స్థిరపడతాడు. ఇలా బిడ్డకోసంగా విభాగాలనే స్థాపింపజేయగల సమర్థులు సాయి సద్గురువు. ఇక బాబూజీ బిడ్డల విషయం కూడా అంతే. చిన్న వయసయినా, గురుదేవుల ఏర్పాటు పెద్దది. బిడ్డ ప్రతిభను ప్రదర్శించడానికై వారు ఏర్పాటు చేసిన సమయం, సందర్భం, ప్రదేశం.... సర్వం వారి కృపావిశేషమే.

నా పేరు స్నేహిత. నాకు గురువుగారంటే చాలా చాలా ఇష్టం. నేను చేసే ప్రతి పని గురువుగారికి చెప్పుకునే చేస్తాను. నేను పెయింటింగ్స్ వేస్తాను. చాలా ఆయిల్ పెయింటింగ్స్ పెద్దవి వేశాను. నేను వేసిన పెయింటింగ్స్‌ని ఎగ్జిబిషన్‌లాగా పెట్టాలని ఉంది, కానీ ఫస్ట్ ఎగ్జిబిషన్ శిరిడీలో పెట్టాలనుకున్నాను. నా కోర్కెను గురువుగారికి చెప్పుకుంటే బాబా ఫోటోలు వేసి శిరిడీలో పెట్టమన్నారు. నేను 15 రోజులలో 18 ఆయిల్ పెయింటింగ్స్ పూర్తి చేశాను. అక్కడ శిరిడీలో గురువుగారి 50వ పుట్టినరోజున పెద్ద ఫోటో గ్యాలరీ ఏర్పాటు చేశారు. అందులో నా పెయింటింగ్స్ కూడా పెట్టారు. ఈ విధంగా నేను ఏమాత్రం ఊహించని రీతిలో అద్భుతంగా గురువుగారి ఫోటోలతో పాటు, నేను వేసిన బాబా పెయింటింగ్స్ కూడా ఆ గ్యాలరీలో పెట్టించారు. ఈ విధంగా 13 సంవత్సరాలకే నాతో గ్యాలరీ పెట్టించి గురువుగారు నా కోర్కె మన్నించారు.

మేము మే నెలలో శిరిడీ నుండి చెన్నై వచ్చేటప్పుడు హైదరాబాద్‌లో చెన్నై బస్సు ఎక్కాము. బస్ దిగేటప్పుడు మేము బస్‌లో మనీ పర్స్ మర్చిపోయాము. ఆ బస్సు తరువాత సెంట్రల్ స్టేషన్‌కి వెళ్ళి ఇక వెళ్ళిపోతుంది. మేము ఆటో ఎక్కాము. పర్స్ లేదని చూసుకుని వెంటనే సెంట్రల్‌కి వెళ్దాం అనుకున్నాం. కాని ఆ బస్‌ని పట్టుకోవడం చాలా కష్టం. అది దొరకటం అంటూ జరిగితే కేవలం బాబా లీలే అనుకున్నాం. ఆశ లేకపోయినా బాబా, గురువుగారే ఇప్పిస్తారు అనే నమ్మకంతో సెంట్రల్ స్టేషన్‌కి వెళ్తూ ఆఫీస్‌కి ఫోన్ చేస్తే, ఆ బస్ నెంబరు కనుక్కుని, దాని లాస్ట్ స్టాప్ ఎక్కడో కనుక్కున్నారు. మేము డైరెక్ట్‌గా అక్కడికి వెళ్ళేసరికి ఆ బస్సు అక్కడే ఉంది. బస్సులో ఎక్కి చూసుకుంటే మా సీట్‌లోనే పర్స్ ఉంది. ఇంకా బస్ క్లీన్ చేయటం మొదలు పెట్టలేదు. ఇలా మా పర్స్‌లో క్యాష్ ఇంకా Valuables వున్నాయి. అన్నీ అలాగే ఉన్నాయి.

మేము శిరిడీ వెళ్ళేటప్పుడు చెన్నై నుంచి హైద్రాబాద్‌కి ట్రైన్‌కి టికెట్స్ బుక్ చేసుకుంటే కన్‌ఫర్మ్ అవ్వలేదు. అందుకని బస్‌కి కూడా రిజర్వ్ చేసుకున్నాము. చివర్లో ఫోన్ చేస్తే టికెట్స్ కన్‌ఫర్మ్ అయినాయి. అందుకని ట్రైన్‌లో వెళ్ళాము. హైద్రాబాద్ వెళ్ళాక తెలిసింది. మేము బుక్ చేసుకున్న బస్‌కి యాక్సిడెంట్ అయ్యిందట. ఇట్లా గురువుగారు మమ్మల్ని రక్షించారు. నాకు స్కూల్‌లో కూడా చాలాసార్లు హెల్ప్ చేశారు. మనం గురువుగారిని, బాబాని నమ్ముకుంటే వాళ్ళెప్పుడూ మనతోనే ఉండి మన బాగోగులు చూస్తూంటారు అన్న విషయాన్ని తెలుసుకున్నాను....

**- స్నేహిత అద్దంకి**, చెన్నై.

## బాబూజీ మాటే నాకు మందు - వారు చెప్పిందే చేస్తా ఇక ముందు

చిన్నారుల ఆరోగ్యాలు సరిగా లేకపోతే అమ్మకు, నాన్నకు ఇబ్బందే కదా! గురుదేవుల చెంత మాటలే మందులు, చేతలే బాటలు. సాయి మహరాజ్ ఎంతోమంది భక్తుల వ్యాధులను, జ్వరాలను.... ఇలా ఇబ్బందులనన్నింటినీ ఊదీతో, ఒక్కొక్కసారి వారి మాటతో తగ్గించిన వైనాలు ఎన్నో! చిన్నారుల చింతలెరిగిన సద్గురుమాయి, బిడ్డ ఏ చెంతనున్నా, బాధ్యత స్వీకరిస్తుంది, బిడ్డ బాధను పోగొడుతుంది. అంతేకాదు, అవసరమైన క్షణాన కావలసిన శిక్షణను ఇచ్చి బిడ్డ ఉన్నతికై ఏర్పాట్లు చేస్తుంది. మాటల మందులు - శిక్షణతో ఏర్పాట్లు.... ఇక అనుభవంలోకి....

నా పేరు సాయిజ. నేను 2nd Standard చదువుతున్నాను. మేము విశాఖపట్నంలో వుంటున్నాము. బాబూజీ తాతయ్య నాకిచ్చిన అనుభవాల్ని మీకు చెప్పాలనుకుంటున్నాను. మొన్న ఆగస్టు 12వ తేదీ నుండి నాకు చాలా జ్వరం. అదికూడా రాత్రిపూట మాత్రమే వచ్చేది. పగలు అస్సలుండేది కాదు. డాక్టర్ టైఫాయిడ్ జ్వరమేమోనని రక్తపరీక్ష చేయించారు. అదేమీ లేదని రిపోర్టు వచ్చింది. రాత్రిళ్ళు చాలా ఎక్కువ జ్వరం వస్తూనే వుంది. ఏ మాత్రం తగ్గలేదు. ఇలాగే వుందంటే, 16వ తేదీ ఉదయం మళ్ళీ ఒకసారి రమ్మని చెప్పారు డాక్టరు. కానీ మేము ఆరోజు డాక్టర్ దగ్గరికి వెళ్ళలేదు. ఆరోజు అమ్మ నరేంద్ర అంకుల్‌కి ఫోన్ చేసి ఇలా వుందని బాబూజీ తాతయ్యకు చెప్పమంది. అప్పుడు అంకుల్ కొన్ని మందుల పేర్లు చెప్పి, అవి తెచ్చి పెట్టుకొని, తరువాత ఫోన్ చెయ్యమన్నారు. ఫోన్ చేస్తే గురువు గారిని కలవడం ఇంకా కుదరలేదని, గురువుగారిని కలిసిన తరువాత తానే ఫోన్ చేస్తానన్నారు. ఇక ఆ రాత్రి అంకుల్ ఫోన్ చెయ్యలేదు. నాకు జ్వరమూ రాలేదు. మరుసటి రోజు అమ్మ ఫోన్ చేస్తే అంకుల్ చెప్పారు, బాబూజీ తాతయ్యకు ఈ విషయం చెప్పారట. బాబూజీ తాతయ్య “ఏం కాదులే, తగ్గిపోతుంది” అన్నారట. గురువుగారు తగ్గిపోతుంది, అన్న తరువాత మందులు



నేను 4 సంవత్సరాలప్పుడు మా అమ్మమ్మ వాళ్ళింట్లో కుర్చీలో నుంచి కిటికీ మీదికి పడ్డాను. ఇనుప చువ్వ తలకి తగిలి బాగా రక్తం వచ్చింది. వెంటనే ఒక టవల్ పెట్టి, నాకు ఊది పెట్టి, డాక్టర్ దగ్గరికి తీసుకుని వెళ్ళారు. వెంటనే రక్తం రావడం ఆగిపోయింది. 5 నిముషాల్లో నేను ఏడుపు ఆపేశాను. ఆ డాక్టరు గారు నా దెబ్బని చూసి అంత తొందరగా ఎలా తగ్గిందా అని ఆశ్చర్యపోయారు. గురువుగారు నన్ను అలా కాపాడారు. నాకు ఏదయినా దెబ్బ తగిలినా, ఏమయినా బాధ కలిగినా, ఎప్పుడూ బాబాకి గురువుగారికి చెప్పుకుని ఊదీ పెట్టుకుంటాను. నాకు వెంటనే బాధ తగ్గిపోతుంది.

**- వ్యూహ**, హైదరాబాద్

## చూడాలని కోరిక - ఏర్పాటు వారి బాధ్యత

ఒక్కడుగు మనం వారివైపుకేస్తే చాలు పది అడుగులు వారు మనవైపుకేస్తానన్న సద్గురు అభయం మన ఎరుకలో వుండగా, మధురమైన ఈ సద్గురు లీలను మనసున దాచే ప్రయత్నం చేద్దాం. మానస అనే ఈ చిన్నారికి తన మదిన ఒక కోరిక. శ్రీ బాబూజీ సందర్శనం - తనకు ఉత్సాహోత్సవం. సరే! అమ్మనడిగింది - నాన్నకు చెప్పింది. సందేహమన్నారు వాళ్ళు. ఏర్పాట్లు చేశారు గురుదేవులు. ఇంకేముంది, ఆనందమే.... ఆనందం.

నా పేరు మానస. మేము స్టీల్‌ప్లాంట్‌లో వుంటున్నాం. మేము పిల్లలందరం కలిసి **odd Sundays** సత్సంగం చేసుకుంటాము. నేను ఇప్పటికి శిరిడీ రెండుసార్లు వెళ్ళొచ్చాను. నాకు ఏప్రిల్ నెలలో 10వ తరగతి ప్రారంభమయింది. మా ప్రిన్సిపాల్ మేడమ్ ఏ పండుగులకు సెలవులు ఉండవని, ఆదివారాలు కూడా స్కూల్ ఉంటుందని చెప్పారు. సెలవులు పెట్టకూడదన్నారు. అప్పుడు నేను ఇంక ఈ సంవత్సరం గురువుగారిని చూడడానికి అవ్వదనుకున్నాను. కానీ అప్పుడప్పుడు గురువుగారిని చూడాలనిపించేది.

ఏప్రిల్ 18న నేను డాడీని తిరువణ్ణామలై తీసుకు వెళ్ళమని అడిగాను. అప్పుడు మా డాడీ డబ్బులు లేవని చెప్పారు. అందుకని నేను చరిత్రలో బాబా చాలమందిని ఏదో విధంగా శిరిడీకి తీసుకువెళ్ళారు కదా. మనలని గురువుగారు కూడా అలాగే తీసుకువెళ్తారా? అని మా అమ్మను అడిగాను. అప్పుడు అమ్మ, అవసరం అయితే తప్పకుండా తీసుకువెళ్తారని చెప్పింది. నేను ఇంక ఆ విషయం వదిలేశాను. ఏప్రిల్ 19న నేను మళ్ళీ రెండోసారి డాడీని తిరువణ్ణామలై తీసుకు వెళ్ళమని అడిగాను. డాడీ ఇప్పుడు మనం ఎక్కడికి వెళ్ళడం లేదు. మళ్ళీ మళ్ళీ అడిగి విసిగించొద్దు అని అన్నారు. అప్పుడు అమ్మ మళ్ళీ మళ్ళీ అలా అడగొద్దు వీలుంటే డాడీయే తీసుకువెళ్తారు అని చెప్పింది. నాకు బాధనిపించింది. అలాగే వెళ్ళి పడుకున్నాను. గంట తరువాత అమ్మా, నాన్న బయటకు వెళ్ళడానికి రెడీ అయ్యారు. తలుపు వేసుకోమని నన్ను లేపారు. అప్పుడు అమ్మ వెళ్తూ నువ్వు గురువుగారిని



# పెద్ద ఇబ్బందులు - చిన్న పరిష్కారాలు - సద్గురు లీలా వినోదాలు

సద్గురు లీలలు అగ్రాహ్యాలు. వాటి వెనుక దాగియున్న అసలు సత్యం వారి అనుగ్రహమే. వారు చేయమన్న చేతలకంటే, వారి మాటల్లోనే దాగివుంది వారి లీలావినోదం. ఆరోగ్యం బాగోని కాకాను చక్కగా రవ్వకేసరి తిని, విశ్రాంతి తీసుకోమంటారు బాబా. డాక్టర్ల మాటకు తిలోదకాలిచ్చి సాయి మాటకు కట్టుబడ్డాడు కాకా. చిన్నారి వ్యూహ విషయంలో ఎదురైన ఇబ్బందులు, పూజ్య గురుదేవులు చెప్పిన మాటలు, సద్గురు లీలా వినోదాలు... మీతో...

నా పేరు వ్యూహ. నాకు 8 సంవత్సరములు. మా మమ్మీ నా చిన్నప్పటి విషయమొకటి చెప్పింది. నాకు 2 సంవత్సరములప్పుడు కంట్లో బాగా పుసులు వచ్చి కళ్ళు కూడా తెరవలేక ఇబ్బంది పడేదాన్నంట. డాక్టరుగారి దగ్గరికి వెళ్తే చిన్న అపరేషన్ చెయ్యాలి అన్నారట. అందరూ చాలా కంగారు పడి బాబాకు, గురువుగారికి చెప్పుకొన్నారంట. ఇంతలో నా పుట్టినరోజు వచ్చింది. మా మమ్మీ, డాడీ "నీకేమి కావాలమ్మా" అని అడిగితే గురువుగారి దగ్గరకి వెళ్దామన్నానంట. నా 3వ పుట్టినరోజుకి నన్ను షిరిడీలో గురువుగారి దర్శనానికి తీసుకొని వెళ్ళారు. గురువుగారు నాకు చాలా చాక్‌లెట్స్ ఇచ్చారు.

అప్పుడు గురువుగారితో నా కళ్ళ విషయం చెబితే, తలకి బాగా నూనె రాసి తలంటు పొయ్యండి అదే తగ్గుతుంది అన్నారు. మా మమ్మీ అలాగే చేస్తే నా కళ్ళు బాగయ్యాయంట. కాని ఈ విషయాలన్నీ నాకు బాగా గుర్తులేవు ఎందుకంటే నేనప్పుడు చాలా చిన్నదాన్ని.

అందుకని నేను ఎప్పుడూ నా పుట్టినరోజుకి గురువుగారి దర్శనానికి వెళ్దామనుకునేదాన్ని. ఈ సంవత్సరం అనుకోకుండా మా పిన్ని అమెరికా నుంచి వస్తే తనని తీసుకుని మేమంతా తిరువణ్ణామలైకి 3 రోజులు ఉందామని వెళ్ళాము. ఇంకో వారంలో నా పుట్టినరోజు. నాకు అప్పటిదాకా ఉండాలని ఉంది. కాని స్కూలు పోతుందని, మా మమ్మీ వద్దంది. నాకు చాలా బాధ కలిగింది. మేము వెళ్ళిన రెండో రోజే గురువుగారు ఊదీ దర్శనం ఇచ్చారు. నేను గురువుగారితో "గురువుగారు, ఫిబ్రవరి 16న నా పుట్టినరోజు. అప్పటి వరకు నేను ఇక్కడే ఉండేటట్లు చూడండి" అని అడిగాను. మరి నా పుట్టినరోజు వరకు మమ్మీ, డాడీ వెళ్దామని అనలేదు. అలానే అక్కడే ఉండిపోయాము. నా పుట్టినరోజు నాడు గురువుగారు మాకు ఊదీ దర్శనమిచ్చి, "ఏమ్మా హ్యాపీగా నీ పుట్టినరోజు జరుపుకున్నావా? ఇక్కడే ఉండాలి అని అడిగావు కదా?" అన్నారు. మా డాడీతో "పుట్టినరోజుకి ఇక్కడే ఉండేటట్లు చూడమని అడిగిందయ్యా" అన్నారు. నాకు గిఫ్ట్, చాలా చాక్లెట్లు ఇచ్చారు గురువుగారు. ఇలా నా కోరిక తీర్చినందుకు నేనెంతో ఆనందపడ్డాను.





ఎందుకని ఫోన్ చెయ్యలేదు అన్నారు. అంతే ఆ రోజు నుండి నాకు మళ్ళీ fever రాలేదు. ఆ రోజంతా ఏ మందూ వేసుకోలేదు. డాక్టర్ దగ్గరికీ వెళ్ళలేదు. అలా ఒక్కమాటతో నా జ్వరాన్ని తగ్గించేశారు. అమ్మ, నాన్న, తాతయ్య అందరం ఎంతో హ్యాపీగా ఫీలయ్యాము.

ఈ మధ్య జరిగిందే ఇంకొక అనుభవం వుంది. ఫస్ట్‌క్లాస్ వేసవి సెలవులలో నేను అమ్మతో కలిసి బాబూజీ తాతయ్య దగ్గరకు తిరువణ్ణామలై వెళ్ళాను. మామూలుగా నేను బాగానే చదువుతుంటాను. గ్రేడ్ అంతా బాగానే వచ్చేది. అయితే రాయడం స్పీడ్‌గా రాసేదాన్ని కాదు. అందుకే ఇంచుమించు రోజూ క్లాస్‌వర్క్ పెండింగ్ పెట్టి వచ్చేదాన్ని. అమ్మ, నా ఫ్రెండ్స్‌కి ఫోన్‌చేసి కనుక్కుని ఫినిష్ చేయించాల్సి వచ్చేది. అమ్మ, నాన్న నాకు ఎన్నెన్నో చెప్పారు. నేనూ రాయాలనే అనుకునేదాన్ని. కానీ నేను రాసేసరికి టైమ్ అయిపోవడమో, టీచర్ అది చెరిపేసి వేరేది రాయడమో చేసేవారు. ఆ సంవత్సరం అంతా అలాగే అయింది. ఒకసారి అమ్మ, నాన్న బాబూజీ తాతయ్య దగ్గరికి వెళ్ళినప్పుడు ఈ విషయం చెప్పారట. తరువాత మళ్ళీ అమ్మ, నేను వెళ్ళినప్పుడు దర్శనం అప్పుడు నేను "బాబూజీ తాతయ్యా! నేను స్పీడ్‌గా రాయలేకపోతున్నాను" అని చెప్పాను. బాబూజీ తాతయ్య "నువ్వు కాపీ రైటింగ్ రాస్తున్నావా" అని అడిగారు. లేదని చెప్పాను. "అది రోజూ రాయి" అని నాకు చెప్పారు. అప్పటి నుండి, అప్పుడప్పుడు మిస్ చేస్తుంటాను కానీ చాలా వరకు రోజూ ఒక పేజీ కాపీ రైటింగ్ రాస్తున్నాను.

నేను కాపీ రైటింగ్ రాయడం స్టార్ట్ చేసిన కొన్ని రోజులకే స్కూల్ తెరిచారు. ఇక ఒక్కరోజు కూడా నేను క్లాస్‌వర్క్ మిస్ చెయ్యడం లేదు. ఆ interest నాకే వచ్చేసింది. ఇప్పుడు మా ఫ్రెండ్స్ వాళ్ళు క్లాస్‌వర్క్ ఏమైనా మిస్ చేస్తే మా ఇంటికి ఫోన్ చేస్తుంటారు. అంత బాగా ఇంప్రూవ్ అయ్యాను.

ఇవేకాదు, స్కూల్లో నీకెప్పుడు అవసరం వచ్చినా బాబూజీ తాతయ్యకు చెప్పుకో! అని చెప్పింది అమ్మ. అలా నేను బోలెడన్నిసార్లు చెప్పుకున్నాను. బాబూజీ తాతయ్య నాకు హెల్ప్ చేస్తూనే వున్నారు.

**- సాయిజ**, వైజాగ్.

చిన్నారుల సంచికకు విశేష స్పందన చాలా సంతోషదాయకం. మీ నుంచి అందిన అనుభవాలు కొన్నింటిని 'గురుకృప' ఈ సంచికలో ప్రచురించలేకపోయింది. మాకందిన అనుభవాలను రాబోయే సంచికలలో ప్రచురించడం జరుగుతుందని సవినయంగా తెలియజేసుకుంటున్నాం. - గురుకృప

**గురుబంధువులు తమ అనుభవాల్ని Internet ద్వారా పంపడానికి**
**leelas@guruji.org కి mail చేయగలరు.**
**ఇంటర్‌నెట్‌లో "గురుకృప" - Visit : www.guruji.org**



# చిత్తరువు కాదది - సద్గురు ప్రత్యక్ష సన్నిధానమే అది

'నాకూ, నా చిత్రపటానికి భేదం లేదు....', 'నేను, ఈ మశీదులో కూర్చొని అసత్యమాడను' అన్న బాబా మాటలను మనం ఎంతవరకు గమనించుకుంటున్నాం. సద్గురు చిత్రపటం ఉంటే వారు మన చెంత ఉన్నట్లేనని, ఇక్కట్లన్నీ తీరినట్లేనని భావిస్తున్నామా? మాటలే కాదు... ఒక అనుభవం కూడా... బాబాను దర్శించవచ్చి నమస్కరించిన బాలబువా సుతార్‌తో 'నువ్వు నాలుగు సంవత్సరాల క్రితం నుంచే నాకు తెలుసు' అని అంటారు బాబా. ఆలోచనలో పడ్డ సుతార్‌కు నాలుగు సంవత్సరాల క్రితం తాను బాబా చిత్తరువుకు నమస్కరించినట్లు గుర్తొచ్చి పులకిస్తాడు. బాబా తాను చేసిన ఆ లీల ద్వారా వారికి, వారి చిత్రపటానికి భేదం లేదని తెలిపితే.... పూజ్య బాబూజీ చేసిన ఈ లీల.... చూద్దామా! మహాత్ముల లీలా వినోదాన్ని...

మాది నెల్లూరు జిల్లా – కోట గ్రామం. మా చిన్నపాప సాయి చావడి 4 సం॥ల వయస్సు. అప్పుడు గురువుగారి పటం వద్ద తన కోరికను విన్నవించుకొంటే గురూజీ ఆ కోరికను ప్రత్యక్ష ఆదేశం ద్వారా తీర్చిన వైనం ఈ క్రింది గురులీల.

గురువుగారి పటం దగ్గర చెప్పుకుంటే కూడా గురువుగారికి తెలుస్తుంది అని సత్సంగాలలో నేను చెబుతుంటే మా చిన్నపాప వినింది కాబోలు. ఒకసారి మా ఇంట్లో ఉన్న బ్లాక్ & వైట్ టి.వి. చెడిపోతే అది రిపేరు చేయించమని నాతో చాలాసార్లు చెప్పింది. నాకు మామూలుగా ఉండే తాత్సారంతో ఆ విషయం పట్టించుకోలేదు. అమ్మాయి నాకు చెప్పి, చెప్పి విసిగి వేసారి ఇక లాభం లేదు అనుకొని ఒకరోజు (జనవరి 1995) ఉదయం నా మిసెస్ పూరీ చేస్తుంటే ఒక ముక్క తుంచి గురువుగారి నోటివద్ద (చిత్తరువుకి) ఉంచి తినమని చెప్తూ, "మా ఇంట్లో పిచ్చి టి.వి. ఉంది మా డాడీని కలర్ టి.వి. తెమ్మని చెప్పండి" అని చెప్పింది. నేను, నా మిసెస్ అది చూసి ఆశ్చర్యపడ్డాము. మా ఇంట్లో ఉన్న టి.వి. ఒక చిన్న ప్రాబ్లెమ్ వచ్చి, మాట వస్తే బొమ్మ వచ్చేది కాదు. బొమ్మ వస్తే మాట వచ్చేది కాదు అలాంటిది ఆ టి.వి.

ఆ తరువాత 2, 3 రోజులకు గురూజీ తిరువణ్ణామలై వచ్చియున్నారని తెలిసి మా పిల్లలను మా బావమరిది గారింట్లో వదిలి, నేను, నా మిసెస్, డా॥ నరేంద్ర తిరువణ్ణామలై వెళ్ళాము. మా పాప గురువుగారి పటం వద్ద అడిగిన కోరిక గురించి నరేంద్రకు కూడా చెప్పలేదు.





గురువుగారు దర్శనానికి వెళ్ళినప్పుడు మొదట నరేంద్ర, ఆ తరువాత నేను నమస్కారములు చేసుకొన్నాము. వెంటనే గురువుగారు నాతో పిల్లలు బాగున్నారా! అని అడిగారు. బాగున్నారు సార్ అని అన్నాను. గురూజీ వెంటనే మీ ఇంట్లో కలర్ టి.వి. లేదా? అంటే ఆశ్చర్యపోయి, లేదు సార్ బ్లాక్ & వైట్ పోర్టబుల్ టి.వి. ఉంది. అది కూడా ప్రస్తుతం రిపేరులో ఉంది సార్ అని అన్నాను. "చిన్నపిల్లలు కదయ్యా! కలర్ టి.వి. ఉంటే చూసి ఆనందిస్తారు కదా! కొనకూడదా" అని అన్నారు గురూజీ.

మొదటి ప్రశ్న పిల్లలు బాగున్నారా, రెండవ ప్రశ్న కలర్ టి.వి. ఉందా, కొనకూడదా అన్న మాటలు వినగానే నాకు ఆశ్చర్యమేసింది. ఇంటిలో ఫ్రిజ్, గ్రైండర్, మిక్సీ ఉన్నాయా కలర్ టి.వి. లేదా అంటే దానికి అర్థం ఉంది. గురూజీ ఇట్లా అడుగుతున్నారేమిటా అని ఆలోచించేసరికి మా పాప రెండురోజుల క్రితం గురూజీ ఫోటో వద్ద కలర్ టి.వి. కావాలని చెప్పుకున్న కోరిక స్ఫురించింది నాకు. గురువుగారు చెబుతున్నారు కొందామనుకున్నాను. వెంటనే "నరేంద్రా! భాస్కర్ నెల్లూరు వస్తాడు లేటెస్టు కలర్ టి.వి. తీసి పంపు" అన్నారు గురువుగారు. వెంటనే కొనడానికి డబ్బు వసతి లేదు గురువుగారు చెప్పారు కదా! స్నేహితుల దగ్గరనో, బంధువుల దగ్గరనో, చేబదులుగా గాని, అప్పుగా గాని తీసుకొని టి.వి. కొందామనుకున్నాను.

ఆ సందర్భంలో గురువుగారి దగ్గర రెండుమూడు రోజులు ఉండి మేము మా వూరికి వెళ్ళాము. మేము ఇంటికి వచ్చే సరికి కావలి నుండి వచ్చిన మా బంధువు ఒకరు నా దగ్గర ఉన్న ఒక స్థలం కొనదలచి రూ॥ 25,000 అడ్వాన్సుగా ఏర్పాటుచేసి వెళ్ళాడు. సమయానికి కావలసిన పైకం కూడా గురువుగారి ఆశీస్సులవల్లే ఏర్పాటయ్యింది. గురువు గారి చిత్రపటం దగ్గర చెప్పుకున్నా, గురువుగారికి తెలుస్తుందన్న విషయం మా పాపకు అనుభవమైంది. మాకు మరోమారు రుజువైనది.

**- సారంగం విజయభాస్కర్**, కోట

*In Walking, Eating, Working, Dreaming, Sleeping,*
*Serving, Meditating, Chanting, Divinely Loving,*
*My Soul Constantly Hums, Unheard by any :*

**Guru, Guru, Guru.......**